క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



కంకిపాడు: సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తహసీల్దార్ టీవీ సతీష్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో వేసవి దృష్ట్యా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ప్రజలకు, సిబ్బందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ టీవీ సతీష్ మాట్లాడుతూ వేసవిలో ఎండతీవ్రత వల్ల కార్యాలయాని కి వచ్చే ప్రజలు తాగునీటి ఇబ్బందులు పడకుండా చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. డెప్యూటీ తహసీల్దార్‌నాగరాజు,ఆర్ఐ వెంకటరమణ, సర్వేయరు భాస్కర్‌రావు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

కేసరపల్లిలో..



కేసరపల్లి (గన్నవరం): మండలంలోని కేసరపల్లి జాతీయ రహదారి బైపాస్ వద్ద గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి చలివేంద్రాన్ని మంగళవారం సర్పంచి చేబ్రోలు లక్ష్మీ మౌనిక ప్రారంభించారు. తొలిరోజు మజ్జిగ సరఫరా చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ..వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు గ్రామ పరిధిలోని ముఖ్య కూడళ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వార్డు సభ్యులు మూల్పూరు మాధవన్, పంచాయతీ కార్యదర్శి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

తెన్నేటిని పరామర్శించిన ఎమ్మెల్యే

పెనమలూరు: పోరంకిలో వైద్యుడు తెన్నేటి సత్యనారాయణను ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి మంగళవారం పరామర్శించారు. సత్యనారాయణ భార్య తెన్నేటి వీరరాఘవమ్మ ఇటీవల మరణించటంతో ఎమ్మెల్యే పోరంకిలో సత్యనారాయణ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

కట్నం వేధింపులపై కేసు

పెనమలూరు: కట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల.. ప్రకారం భీమవరానికి చెందిన కొనకళ్ల లక్ష్మి, రెండు సంవత్సరాల క్రితం యనమలకుదురుకు చెందిన కొనకళ్ల విశ్వనాథ్‌ను వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. వీరికి కుమారుడు ఉన్నాడు. కాగా భర్తతో పాటు అత్త వెంకటేశ్వరమ్మ, మామ నాంచారయ్య అదనపు కట్నం కోసం వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు అత్తింటివారిపై కేసు నమోదు చేశారు.

వ్యక్తికి గాయాలు

పెనమలూరు: గోసాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడిన సంఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోసాల చింతలకట్టకు చెందిన షేక్ అక్బర్ సైకిల్ పై గోసాల సెంటర్‌లో వెళుతున్నాడు. ఇదే సమయంలో కంకిపాడు నుంచి విజయవాడ వైపునకు వెళుతున్న బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన అక్బర్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: వివిధ్న ప్రతిభావంతులకు ఉపకరణాలు అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బాపులపాడు ఎంపీడీవో ప్రభాకరరావు మంగళవారం విలేకరులకు తెలిపారు. అంధుల చేతి కర్రలు, బ్రెయిలీ లిపి కిట్, చేతి ఊతకర్రలు, మూడు చక్రాల సైకిల్, చక్రాల కూర్చీ, కృత్రిమ అవయువాలు వంటి ఉపకరణాలు అవసరమైన దివ్యాంగులు తమ పరిధిలోని గ్రామ సచివాలయాల్లో తక్షణమే సంప్రదించి, దరఖాస్తు అందజేయాలని ఆయన సూచించారు.

డీసీఎంఎస్ మాజీ చైర్మన్ మృతికి సంతాపం

ఉయ్యూరు: డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కంచి రామారావు మృతి బాధాకరమని కాపు సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు దాసు శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలో కంచి రామారావు మృతికి మంగళవారం దాసు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ ఉయ్యూరుతో కంచి రామారావుకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో కంచికి గల అనుబంధాన్ని తెలియజేసి నివాళులర్పించారు. పలువురు నాయకులు కంచి మృతి పట్ల సంతాపం తెలిపారు.

సీపీఎం నేతకు నివాళి

గన్నవరం: మండలంలోని బుద్దవరం గ్రామంలో మంగళవారం వామపక్షాల ఆధ్వర్యంలో సీపీఎం ఉద్యమ నేత చింతపల్లి లక్ష్మారాయుడు 3వ వర్థంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రామ సర్పంచి బడుగు బాలమ్మ, సీపీఐ నేత కొండా వీరాస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ..తెలంగాణ సాయుధ పోరాటంలో ఆంధ్ర ప్రాంతంలో నెలకొరిగిన తొలి అమర వీరుడు చింతపల్లి పాపారావు స్ఫూర్తితో లక్ష్మారాయుడు విద్యార్థి దశలోనే పోరాటాల్లోకి వచ్చారని గుర్తు చేశారు. మాజీ సర్పంచి గండికోట దశరథరామయ్య, సీపీఎం నేతలు బడుగు మరియదాసు, నక్కా రామారావు పాల్గొన్నారు.

నాట్యకళలో చిద్విలాసం

- కూచిపూడి నృత్యంలో రాణిస్తున్న చిన్నారి
- పురస్కారాలు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు స్వీకరణ
- నర్తన సౌందర్య లహరి పురస్కారం



కలెక్టర్ ఢిల్లీరావు, అంతర్జాతీయ జానపద గాయకుల సమక్షంలో ప్రశంసలందుకుంటున్న చిద్విలాసిని (ఫైల్)

గన్నవరం రూరల్ : కూచిపూడి నృత్యంలో చిన్న వయస్సులోనే తన ప్రతిభతో ప్రశంసలు అందుకుంటోంది రామినేని చిద్విలాసిని. కృష్ణా జిల్లా గన్నవరం మండలం సావరగూడేనికి చెందిన రామినేని రవిబాబు, ప్రసన్నాదేవి దంపతుల కుమార్తె. గన్నవరం జెడ్పీ బాలికల హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న చిన్నారి, కూచిపూడి నాట్య గురువు వనజా చంద్రశేఖర్ వద్ద గడచిన మూడేళ్లుగా శిక్షణ పొందింది. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని అనేక వేదికలపై తన నాట్యంతో పండిత, పామరుల ప్రశంసలు పొందింది.

కళావేదికలపై ప్రశంసల జల్లు..

రాష్ట్రంలో అనేక కళావేదికలపై ప్రదర్శనలు ఇచ్చింది. ఇటీవల రాజమండ్రి శ్రీ లలిత కళా నృత్యనికేతన్ ఆధ్వర్యంలో పోటీల్లో నర్తన సౌందర్య లహరి పురస్కారం సాధించింది. విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో అమరావతి బాలోత్సవంలో పాల్గొని పురస్కారాలు పొందింది. ప్రజా నాట్య మండలి పదో రాష్ట్ర మహాసభల్లో కళా ప్రదర్శన జ్ఞాపిక, గన్నవరం బాలోత్సవంలో క్లాసికల్ డ్యాన్స్ సోలో పోటీల్లో తృతీయ బహుమతి, శ్రీ కాశీవిశాలాక్షి అన్నపూర్ణ సహిత విశ్వేశ్వరస్వామి దేవస్థానం వేదికపై, విజయవాడ హర్ష క్రియేషన్స్ నాలుగో వార్షికోత్సవంలో, ప్రజా నాట్య మండలి శివ తాలెల్లియలో కళా సాంస్కృతిక వేదికపై, యనమదల కుదురు శివరాత్రి కళావేదికపై, సావరగూడెంలో కూచిపూడి నృత్యోత్సవంలో ప్రతిభ చాటింది. ఇప్పటి వరకూ 30కి పైగా ప్రదర్శనలు ఇచ్చి శభాష్ అనిపించుకుంది. విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో, కేబీఎన్ కళాశాలలో జాషువ సాంస్కృతిక వేదిక, ఉగాది సాంస్కృతిక ఉత్సవాల్లో మెమెంటోలు, ప్రశంసా పత్రాలు కైవశం చేసుకుంది.

వారసత్వంగా..

చిద్విలాసిని తండ్రి రవిబాబు ప్రజానాట్య మండలి కళాకారుడిగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రదర్శనలు ఇచ్చారు. ఆయన ప్రోత్సాహంతో తల్లి ప్రసన్న దేవి సాయంతో చిన్న వయస్సులోనే ప్రశంసలు పొందుతోంది.

సత్కారాలు..

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, అంతర్జాతీయ జానపద గాయకుడు దామోదర గణపతిరావు, చిద్విలాసినిని ఘనంగా సత్కరించారు. సినిమా నటులు అజయ్‌ఘోష్, కృష్ణేశ్వరరావు, ప్రజానాట్య మండలి సీనియర్ కళాకారులు చిద్విలాసిని ప్రతిభను మెచ్చుకుని సత్కరించారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, ఆర్థిక శాస్త్ర నిపుణుడు గన్నె వెంకట్రావు చిన్నారి ప్రతిభను కొనియాడారు. కూచిపూడి నాట్యంలో మరెంతో కీర్తి ప్రతిష్టలు సాధించాలని పలువురు కళావేదికలపై చిద్విలాసినిని దీవించారు.



సాధించిన మెమెంటోలు, ప్రశంసా పత్రాలు, మెడల్స్‌తో చిద్విలాసిని

ప్రభుత్వ సంక్షేమ పథకాలతో వెలుగు

- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి
- కామయ్యతోపులో గడప గడపకు మన ప్రభుత్వం



కామయ్యతోపులో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో తమ కుటుంబాల్లో వెలుగు నిండిందని, ప్రభుత్వ పథకాలు అన్ని సక్రమంగా అందుతున్నాయని లబ్ధిదారుడు ఎస్.ప్రసాద్‌తో పాటు పలువురు లబ్ధిదారులు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి కామయ్యతోపులో పర్యటించి లబ్ధిదారులకు ప్రభుత్వం అమలు చేసిన పథకాల వివరాల బుక్‌లెట్‌లు అందించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా జగనన్న సంక్షేమ పథకాలు పేద, మధ్య తరగతి వర్గాలకు అందుతున్నాయని తెలిపారు. స్థానికంగా మంచినీటి సమస్య ఉందని, పారిశుద్ధ్యం సరిగా లేదని, దోమలు ఎక్కువగా ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు.

బాధ్యత పెరిగింది..

గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం వలన తమకు బాధ్యత పెరిగిందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. జగనన్న ఇచ్చిన ఆదేశాల మేరకు తాము ప్రతి గడపకు తిరిగి సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. జగనన్న అమలు చేసిన పథకాలతో తాము ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్ల గలుగుతున్నామని అన్నారు. జగనన్న పాలనలో ఎమ్మెల్యేలు అందరికీ గుర్తింపు వచ్చిందని తెలిపారు. జగనన్నను గెలిపించుకోవటానికి అందరూ కలిసి పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎస్.ప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నేతలు వేమూరి బాలకృష్ణ, తుమ్మల వరదీష్, అన్నే శ్రావణ్, అంగిరేకుల సీతారామయ్య, క్రిస్టాఫర్, ఆంజనేయ ప్రసాద్, శ్రీరాములు, మెరుగు శ్యామ్, పీజె.కిషోర్, పిన్నబోయినరవి, ఈదా రాజేష్, తుమ్మల రాంబాబు, సుబ్బరాజు, మాదు రమేష్, బబ్లూ పలువురు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో ఇల్లు నిర్మాణం

చోద్యం చూస్తున్న అధికారులు



వైకుంఠపురంలో రోడ్డు మార్జిన్ ఆక్రమించి నిర్మిస్తున్న ఇల్లు

పెనమలూరు: గోసాల వైకుంఠపురంలో ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలం, రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించి అక్రమంగా ఇల్లు నిర్మాణం చేస్తున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి చర్యలు తీసుకోవటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో టీడీపీ నేతల మద్దతుతో వ్యక్తి అక్రమంగా ఇల్లు నిర్మాణం చేస్తున్నాడని స్థానికులు తెలిపారు. ఇంటి నిర్మాణం కింద వాటర్ పైప్‌లైన్ కూడా ఉందని అన్నారు. ఇంత బహిరంగంగా అక్రమ నిర్మాణం జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని స్థానికులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఈవో ప్రసాద్‌ను వివరణ కోరగా స్థలం ఆక్రమించి ఇల్లు నిర్మాణం చేస్తున్న విషయం వాస్తవమేనన్నారు. ఆక్రమణ దారుడిని హెచ్చరించినా ఇల్లు నిర్మాణం చేస్తున్నాడని తెలిపారు. అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకుంటామన్నారు.

బాలిక మృతిపై నిష్పక్షపాతంగా విచారణ చేయాలి

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



కానూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: పెనమలూరు పోలీస్‌స్టేషన్‌పై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, పోరంకిలో మృతి చెందిన బాలిక కేసును నిష్పక్షపాతంగా విచారణ చేయాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఆయన కానూరులో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్ పై ఆర్థిక లావాదేవీల కారణంగా వివాదాలు తలెత్తుతున్నాయన్నారు. ప్రధానంగా కేసుల విషయంలో పేదలకు న్యాయం చేయాల్సి ఉందన్నారు. ఇటీవల పోరంకిలో మృతి చెందిన బాలిక విషయంలో పోలీసులు అవలంభించిన తీరు సక్రమంగా లేదన్నారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా బాలిక ఇంట్లో పని చేస్తూ యజమాని వైఖరి కారణంగా అవమాన భారంతో మృతి చెందినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ కేసును పూర్వ సీఐ నిస్పక్షపాతంగా, న్యాయబద్దంగా విచారణ చేయలేదని తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయం మండల పరిధిలో ప్రజలకు అనుమానాలకు తావిచ్చిందని అన్నారు. ఈ కేసులో యజమానుల పాత్రలేక పోతే వారు ఎందుకు పారిపోయారని ప్రశ్నించారు. ఇప్పుడు వచ్చిన సీఐ రాజకీయాలకు అతీతంగా ఈ కేసును సక్రమంగా విచారణ చేసి ఎవరు దోషులైతే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. నగర శివారులో ఉన్న పెనమలూరు పోలీస్‌స్టేషన్‌పై జిల్లా అధికారులు దృష్టి పెట్టి ప్రజలకు మేలు చేయాలని కోరారు.

సీఐ బాధ్యతల స్వీకరణ



పెనమలూరు: పెనమలూరు సీఐగా ఎం.కిషోర్‌బాబు విధుల్లో చేరారు. ఇక్కడ సీఐగా పని చేసిన గోవిందరాజును ఎస్పీ ఆకస్మికంగా బదిలీ చేయటంతో అతని స్థానంలో పమిడిముక్కల సీఐగా పని చేస్తున్న ఎం.కిషోర్‌బాబును పెనమలూరుకు నియమిస్తూ ఎస్పీ జాషువా ఆదేశాలు ఇచ్చారు. దీంతో కిషోర్‌బాబు సీఐగా సోమవారం రాత్రి పెనమలూరులో బాధ్యతలు చేపట్టారు.

40 మందికి దంతవైద్య పరీక్షలు



గన్నవరం రూరల్: దంతాల సంరక్షణతోనే మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల నిపుణులు డాక్టర్ అజయ్ బెనర్జి చెప్పారు. మంగళవారం మండలంలోని గోపవరపుగూడెం గ్రామ సచివాలయం వద్ద ఉచిత దంత వైద్య శిబిరాన్ని సర్పంచ్ నల్లూరు వెంకటేశ్వరరావు ప్రారంభించారు. శిబిరంలో 40 మందికి చికిత్సలు చేశారు. కమ్యూనిటీ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ నాయుడు, పంచాయతీ కార్యదర్శి శ్రీనువణేష్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

పంటల సంరక్షణలో మెలకువలు అవసరం



పెనమలూరు: పంటల సంరక్షణలో రైతుల మెలకువలు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం అధికారులు డాక్టర్ సుధారాణి, కె.జ్యోతిరమణి అన్నారు. తాడిగడప గ్రామంలో మంగళవారం చెరకు, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. చెరకు పంటలో ఇనుము లోపం ఉందని, పెంకు పురుగు ఉధృతి ఉందన్నారు. మొక్క జొన్న పంటలో కత్తెర పురుగు చాలా ప్రమాదకరమన్నారు. వీటి నివారణపై రైతులు దృష్టి పెట్టాలని సూచించారు. రైతులు మట్టి నమూనాలు సేకరణకు సహకరించాలని, ఈకేవైసీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో కనకమేడల శైలజ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన



పింఛను పంపిణీని పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు



కిడ్నీ బాధితులకు పింఛను అందిస్తున్న సర్పంచ్ సోనియా

ఉయ్యూరు: పింఛన్ల పంపిణీ పండుగలా కొనసాగుతోంది. వేకువఝాము నుంచే వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేపట్టారు. ఉయ్యూరు మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో మంగళవారం ఉత్సాహంగా పింఛన్ల పంపిణీ కొనసాగింది. కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్ పింఛన్ల పంపిణీని పరిశీలించారు. నూరుశాతం పింఛన్ల పంపిణీకి కృషి చేయాలని సూచించారు. మండలంలోని 11 గ్రామాల్లో పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఎంపీడీఓ విమాదేవి పరిశీలించారు.

కంకిపాడు: అర్హులందరికీ ప్రభుత్వం పింఛన్లను అందిస్తుందని ఉప్పలూరు సర్పంచ్ లాం సోనియా అన్నారు. మండలంలోని ఉప్పలూరు గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన కిడ్నీ బాధితురాలు జి.పుట్లమ్మకు రూ.10 వేలు పింఛను అందించారు. గ్రామంలో చేపట్టిన పింఛన్ల పంపిణీని తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న ప్రభుత్వానికి బాసటగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత లాం సురేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ రత్నాకర్, వలంటీరు వేము కుమారి పాల్గొన్నారు.

స్థలం మంజూరు చేయాలని వినతి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘ నేతలు

పెనమలూరు: స్థానిక బాల విఘ్నేశ్వర నాయీ బ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం స్థలం మంజూరు చేయాలని ఆ సంఘ నేతలు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. సంఘ నేతలు మాట్లాడుతూ పేద నాయీ బ్రాహ్మణులు శుభ కార్యక్రమాలు చేసుకోవటానికి కమ్యూనిటీ హాల్ లేదన్నారు. స్థలం మంజూరు చేస్తే సంఘ నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నేతలు ఆకునూరు బసవరాజు, మద్దిరాల వెంకట సుబ్బారావు, పరస బాలకృష్ణ, తెన్నేటి ప్రకాష్, ఆకునూరు రాఘవరావు, ఆనందరాజు, రమేష్, ప్రసాద్ పలువురు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న గంజాయి, ఇద్దరు నిందితులతో ఎస్ఐ కె.సుధాకర్, సిబ్బంది

కంకిపాడు: ఇద్దరు గంజాయి విక్రేతలను కంకిపాడు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఎస్ఐ కె.సుధాకర్ కథనం మేరకు..పునాదిపాడు ఫ్లై ఓవర్ సమీపంలోని రియల్ ఎస్టేట్ వెంచర్‌లో ఇద్దరు వ్యక్తులు గంజాయితో ఉన్నట్లు సమాచారం మేరకు దాడి చేయగా ఇద్దరు వ్యక్తుల వద్ద సుమారు కిలో ముప్పావు (1.750) గంజాయిని గుర్తించామన్నారు. వీరిని గొల్లగూడెంకు చెందిన ఉమేష్, కంకిపాడుకు చెందిన కె.పవన్‌కుమార్‌గా నిర్ధారించారు. డెప్యూటీ తహసీల్దార్ నాగరాజు పర్యవేక్షణలో నిందితులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

3 కిలోల గంజాయి స్వాధీనం..

పెనమలూరు: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ గంగూరు శ్మశానవాటిక వద్ద గోసాలకు చెందిన అనమాల మోహన్, గోరెంట్ల ఉదయ్‌కిరణ్, గంగూరుకు చెందిన జి.సాయి గంజాయి అమ్ముతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 3 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వండి



పెనమలూరు: తాడిగడప జంక్షన్‌లో బాబాసాహెబ్ అంబేడ్కర్, జ్యోతీరావ్‌పూలే విగ్రహాలు ఏర్పాటు చేయటానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ బీసీ సంఘ నేతలు తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎస్.ప్రకాశరావుకు వినతపత్రం అందచేశారు. పోరంకి మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం బీసీ నేతలు కమిషనర్‌ను కలిశారు. తాము నేతల విగ్రహాలు ఏర్పాటు చేయటానికి సిద్ధంగా ఉన్నామని, అనుమతులు మంజూరు చేయలని కోరారు. ఏపీ బీసీ సంఘ ప్రధాన కార్యదర్శి ముచ్చు నాగేంద్రబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకునూరు సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శి నరేష్ కుమార్, మున్సిపాలిటీ బీసీ మహిళా సంఘ అధ్యక్షురాలు ఉండి విమలాదేవి పలువురు పాల్గొన్నారు.

కుర్చీలు బహూకరణ



గన్నవరం: పేద ప్రజల అభ్యున్నతికి ఫర్ కార్నర్స్ మిషన్స్ తమవంతు తోడ్పాటునందిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ కంకిపాటి అశోక్‌కుమార్ తెలిపారు. మండలంలోని దావాజిగూడెం, బుద్దవరం, అల్లాపురం, వీఎన్.పురం, బల్లిపర్రు గ్రామాల్లో ఫర్ కార్నర్స్ మిషన్స్ ఆధ్వర్యంలో వృద్ధులు, వితంతువులకు కూర్చీలు, డయాబెటిక్ చెప్పులు, కళ్లజోళ్లు, చీరలు, బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కంకిపాటి మాట్లాడుతూ.. భవిష్యత్‌లో మరిన్ని గ్రామాలకు తమ సేవలను విస్తరించనున్నట్లు చెప్పారు. అనంతరం ఉంగుటూరు మండలంలోని ఆత్కూరు, అవుటపల్లి గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకయ్య



గన్నవరం: బార్ అసోసియేషన్ గన్నవరం శాఖ నూతన అధ్యక్షుడిగా తిరివీధి వెంకయ్య ఎన్నికయ్యారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలిగా దాసరి భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా జాస్తి తాతారావు, సంయుక్త కార్యదర్శిగా ఎల్. భగీరథి, కోశాధికారిగా టి.వెంకట్రావు ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా అనుమోలు వెంకటేశ్వరరావు, సతీసక్కుబాయి, సీహెచ్. అంజయ్య, జీ భాస్కర్, కె.సుబ్రమణ్యేశ్వరరావు, బీవీఎస్.స్వామి, డి. భద్రినాథ్, వాసుదేవరావు, ఎల్ఆర్‌కే సావిత్రి నియమితులయ్యారు. నూతన కార్యవర్గాన్ని సీనియర్ న్యాయవాదులు, పీ నర్సరాయుడు, ఆళ్ల కృష్ణకిషోర్, శీలం వెంకటసాంబశివరావు తదితరులు అభినందించారు. స్థానిక జెడ్పీ క్రీడా ప్రాంగణంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకయ్యను సత్కారించారు.

డ్రెయినేజీల నిర్మాణానికి చర్యలు



సమస్యలు తెలుసుకుంటున్న సర్పంచి లింగాల భాస్కరరావు

పెనమలూరు: పెనమలూరు అంబేడ్కర్‌కాలనీలో డ్రెయినేజీల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని వైఎస్సార్ సీపీ నేత, గ్రామ సర్పంచి లింగాల భాస్కరరావు అన్నారు. ఆయన మంగళవారం అంబేడ్కర్ కాలనీలో పర్యటించి సమ్యలు తెలుసుకున్నారు. స్థానికులు మాట్లాడుతూ డ్రెయినేజీలు లేక పోవటంతో మురుగు నీరు పారుదల జరగటం లేదన్నారు. దోమలు కూడా విపరీతంగా ఉన్నాయని తెలిపారు. దీనిపై సర్పంచి భాస్కరరావు మాట్లాడుతూ త్వరలో డ్రెయినేజీలు మరమ్మతులు చేస్తామన్నారు. అవసరమైన ప్రాంతాల్లో డ్రెయినేజీల నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. దోమల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ ఈవో రాధాకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి రంగమ్మ పేరంటాలు తిరునాళ్ల

ఉంగుటూరు: తేలప్రోలులో రంగమ్మపేరంటాలు తిరునాళ్ల ఈ నెల 6 నుంచి 9 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ వారసులు జక్కా సోదరులు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ 6,7 తేదీల్లో అమ్మవారి ఊయల కార్యక్రమం ఉంటుందన్నారు. అమ్మవారికి మొక్కుబడలు చెల్లించుకుని,గుడి చుట్టూ ప్రదక్షిణ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. 9న అమ్మవారికి బోనాలు సమర్పిస్తారని చెప్పారు. ఉత్సవాలు జయ ప్రదం చేసేందుకు వారసులతో సహకరించాలని కోరారు.

9న విజయేంద్ర సరస్వతి రాక



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ ట్రస్టీ, గ్రామ పెద్దలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నున్నలోని శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి వారి దేవస్థానం (చినకంచి)లో ఈనెల 9న శంకర విజయేంద్ర సరస్వతి స్వామి భక్తులకు అనుగ్రహ భాషణతో ఆశీర్వదించనున్నారని చిన కంచి ట్రస్టీ మొక్కపాటి శర్మ తెలిపారు. నున్నలోని చినకంచిలో మంగళవారం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ విజయేంద్ర సరస్వతీ స్వామి చినకంచి దేవస్థానాన్ని ఈనెల 9న ఆదివారం సందర్శించి, సాయంత్రం అనుగ్రహ భాషణ చేస్తారు. సోమవారం మహాత్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వరునికి త్రికాల పూజ చేస్తారు. అనంతరం అన్నసంతర్పణ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో గ్రామ పెద్దలు జీతం శ్రీనివాసరావు, అంగజాల హనుమా, కలకోటి నాగిరెడ్డి, ఆడిటర్ రామారావు, నారాయణ రెడ్డి, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.